# 4. రెండు తలలు

సుబ్బారావు చదువు చూస్తే నాకు ముచ్చెమటలు పోసినై. తనకు తెలిసినదాన్నీ, కంఠతావచ్చిన విషయాన్నే వాడు ఒకటికి పదిసార్లు అదేపనిగా రుబ్బటంలో అర్థమేమిటో నాకు తెలియలేదు. తెలివితేటలూ, జ్ఞాపకశక్తీ బాగా ఉన్నాక ఒక్క కష్టపడి చదవటం మీదనే ఆధార పడే అవసరం కూడా వాడికి లేదాయె!

ఒక రాత్రివేళ లేచి చూస్తే పుస్తకమూ వీడూ తయారు! తెల్లవారుజామున చూస్తే మసిబారిన లాంతరు ముందు గొఋక్కుంటూ కూర్చునేవాడు. సాయంత్రం చల్లగాలికని రైలుపట్టాల మీదుగా వెళ్తే తెరిచిన పుస్తకం చేతుల్లో లేకుండా రాడు.

వీణ్ని చూసి నేనేమన్నా నేర్చుకోవాలా అనే అనుమానం కూడా కల్గింది. వాడిలాగు చదివి, పరీక్షకు మాత్రమే కాకుండా, యూనివర్శిటీ వాళ్ళు నిర్ణయించిన విజ్ఞానానికన్న ఎక్కువ సంపాయించటం నిరపాయకరమైంది గానే తోచింది. కాని...వాడిలాగు ఆ పట్టుదలనూ శక్తినీ ఎలా తెచ్చుకోను? వెంటనే ఇంకో ప్రశ్నకూడా వచ్చింది. పోనీ వాడు నాలాగా మారితే? నాతోపాటే యీ పరీక్షకు ఐదు నెల్లనుంచీ కలిసి చదువుతూండటం వల్ల ఇద్దరమూ ఇంచుమించుగా ఒకే స్థితిలో ఉండటంలో ఎంత తృప్తి! ఇది ఈర్ష్యేమో కూడా నాకు తెలియదు. నేను వాడిలాగు మారలేకపోయినా, వాడు నాలాగు మారగలడేమో? అందుకనే మెల్లగా ప్లేటువేశాను–

"అంత చదువుతే ఆరోగ్యం పాడవదూ?"

"ఆఁ... అలవాటేలే!" అన్నాడు గాలిపీల్చినంత తేలిగ్గా.

"ఉహూఁ... అది కాదు. నీకు మిగిలింది ఒక్క ఇంగ్లీషేగా– దానికోసమే ఇంత కష్టపడాలా అని...?"

"ఎక్కువ చదువుతే యేం?"

"ఏమీలేదు. అనవసరం. అన్ని సబ్జక్టులూవున్నా అంత కష్టపడుతున్నానా?"

"ఇంతకూ నువ్వు చెప్పే లెఖ్ఖన, నువ్వు చదివేదాంట్లో మూడో భాగమైతే చాలంటావ్? ఎలాగైనా లెక్కల గ్రూపు వాడివి కదూ?"

వీడేదో నా మీద తప్పు అభిప్రాయాన్ని జారీ చేస్తున్నట్టున్నాడు.

"అదికాదు- నీది మంచిపనైనా, నీలాటి తెలివిగల బుర్రకు ఇంత శ్రమ అవసరమా అని..." అన్నాను.

"ఆరుసార్లు దెబ్బతిని వున్నాను- తెలుసా?" అన్నాడు.

సరే- ఇంక అర్థమైంది. గత మూడు సంవత్సరాల నుంచీ భూమిశిస్తులాగు ఆ యూనివర్శిటీ వాళ్ళకు వాయిదా ప్రకారం పరీక్ష ఫీజు కడుతున్నా వాళ్ళకు వీడిమీద దయ కలగలేదు. మరికొన్ని సంవత్సరాలపాటు మీ ఇంటర్‌లో కూర్చునేందుకు నిరాకరిస్తూ, రాబర్టు బ్రూస్‌లాగు యీ పట్టుదలను సంపాయించాడన్న మాట! ఎటూ యీ తర్కంలో లాభం లేదని వాడి చదువు పిచ్చికి నేను అడ్డుపోలేదు.

తెల్లవారితే ఇంగ్లీషు పరీక్షనగా- సుబ్బారావు ఆ రాత్రంతా చదువుతూనే ఉన్నాడు. మధ్యమధ్య నన్ను ప్రశ్నలు వెయ్యమనీ, ప్రశ్నరాగానే పదిరకాల పుస్తకాల్లోంచి జవాబుల్ని కలిపి- తద్దినపు బ్రాహ్మడు మంత్రాలు చదివినంతవడిగా వొప్పచెప్పాడు. వాడి ధోరణిచూస్తే మామూలుగా అందరికీ ఇచ్చే పేపర్లకన్న - కనీసం రెండు రెట్లెక్కువ కష్టంగా ఉన్న పేపరు ప్రత్యేకంగా వాడికి ఇవ్వకపోతే - యూనివర్శిటీ ఫస్టు మాత్రం వాడికి తప్పదు. వాడికున్న విజ్ఞానంలో పదోవంతు నాకుంటే యీ యూనివర్శిటీ వాళ్ళకు రెండోసారి పరీక్షఫీజు కట్టేవాణ్నా? వాడి వెనక నెంబరు నా దవటంవల్ల, ముందు వాడి పేపర్ను విలువకట్టాక, ఆ ధోరణిలో, దృష్టిలో- నాది చూస్తే నాకు మార్కులేం పడతాయ్? నా చదువును వాడి చదువుతో పోల్చి చూసుకుంటే- ఎలా పాసవుతాననే భయంకూడా కలిగింది... కాని నిరాశపడి ఏం లాభం?

పేపర్లిచ్చేవరకూ సుబ్బారావు చేతిలోని పుస్తకం మూయబడలేదు. పేపర్లిచ్చారు: మెల్లిగా చూశాను. ఫర్వాలేదు. రాత్రి సుబ్బారావు ఆసుధారగా వొప్పగించిన జవాబులు కొద్దికొద్దిగా జ్ఞాపకముంటే పాసుమార్కులకు దేకవచ్చు.... నిస్సందేహంగా సుబ్బారావు మాత్రం చెక్కిపారేస్తాడు-

సుబ్బారావు కలం వడివడిగా కదుల్తోంది. మెల్లిగా నేను కూడా రాయటం మొదలెట్టాను. ఇరవై నిమిషాలయ్యాక చూస్తే- సుబ్బారావు హాలు వాసాల్ని లెక్కిస్తున్నాడు అన్నీ వాడికి తెలిసినవే కనక ఏది ముందు రాద్దామా అనే ఆలోచనలో ఉన్నాడు కాబోలు!... కాస్త ఆగి వెనక్కు తిరిగి చూశాను. వాడి ముఖం నేను అనుకున్నట్లు

వికసించి ఉండటానికి బదులు పాలిపోయి వుంది. కళ్ళు ఎర్రబారి, బోనులో పడ్డ మృగం తను తప్పించుకునే దారి ఎటున్నదా అని గుడ్లు అన్ని వైపులకు తిప్పుతూవున్నట్టు – బెదురుచూపులు చూస్తున్నాడు... నా నుంచి ఏమన్నా సహాయం కావాలేమోనని రెండు నిమిషాలు వాడి వైపు చూశాను, కాని వాడు తలకాయ తిప్పేశాడు.

అరగంటకాగానే పేపరు వదిలేసి, మిగతా వాళ్ళవంక సిగ్గుతోచూసి, తలొంచుకొని వాడు వెళ్ళిపొయ్యాడు. నాకు అనేక అనుమానాలు వచ్చినై. వాడికింత భయం దేనికి? జ్వరం వచ్చిందా?... అసలు యీ ఆలోచనకు నాకిది సమయం కాదు.

ఉదయాన పేపరు బాగా రాశాననిపించింది. ఆ మధ్యాహ్నం కూడా వాడెక్కడా కన్పించలేదు. ఏమయ్యాడో?

మధ్యాహ్నం పేపరు చూసేప్పటికి నాకు జ్వరమొచ్చి నట్టయింది. ఎంత బాగా రాసినా లాభంలేదు. మొత్తం ఇంగ్లీషు పరీక్షను, ఇంకోసారి దర్శించాల్సిందే! వృథాగా శ్రమపడటం కూడా దేనికి? కాని అరగంట కాందే బైటికి వెళ్ళేందుకు వీల్లేదు... ముప్పై నిమిషాలు ఏం చెయ్యను? ఇతర కుర్రాళ్ళను చూస్తే వారూ నాలాగే బాధపడుతూన్నట్టు తోచింది.

వెధవపరీక్ష! ఎగ్జామినర్లు! పాడుచదువు! పోతే పోయింది. ఇంటికెళ్ళి బాగా రాసివచ్చినట్టు ఫోజువేస్తే సరిపోతుంది... ఈ ఆలోచనతో ఒక విధమైన ఆనందం తోచింది. నేనేదో త్యాగంచేసి అపజయాన్ని ఎదుర్కొన్నట్టూ ఇప్పుడు మొండి గుండెతో యీ నష్టాన్ని తేలిగ్గా చూసి కుంగిపోయినట్టూ తలిచాను. వీళ్ళందరిలాగూ వృథా ప్రయాసన పడక ఒకసారిగా తేల్చుకొని చాలామందికి యీర్ష్యను కలుగ జెయ్య గలుగుతున్నాననే ధీమాతో ఇంటికి మళ్ళాను. ఓటమిలో కూడా ఆనందం వుందేమో?

సుబ్బారావు తలగడాలో ముఖం దాచుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. మొదట వాడి ముఖం కన్పించకపోవటంవల్ల ఇది తమాషా అనుకొని పెద్దగా నవ్వసాగాను. కాని వాడు నాతో శృతి కలపలేదు. ఏదో బాధతో కుంగిపోతూ, ఇంతసేపూ నా సానుభూతికోసం కనిపెట్టుకు కూర్చున్నట్టు ముఖం ఎత్తి దీనంగా నా వైపు చూశాడు... వెధవ పరీక్ష పోయినందుకు నిజంగానే ఏడుస్తున్నాడు! ఈ వింత నాకు అర్థమవలేదు.

"ఏడుస్తావ్ దేనికీ?" అన్నాను, ముఖం చిట్లించి.

వాడు ఏడుపు మానలేదు. నా స్థితి ఘోరంగా తయారైంది. ముందు నన్ను నేను ఓదార్చుకుంటూ వీడిభారాన్ని కూడా నాపైన వేసుకోవాల్సి వచ్చింది... చాలాసేపు బతిమాలాక ఏడుపు మానాడు.

"నేను ఇంటికి ఏ ముఖం పెట్టుకు వెళ్ళను?" అన్నాడు. ఇదంతా నన్ను ఉద్ధరించేందుకల్లే చూస్తూ.

"వెళ్ళక?"

"ముక్కు మూసుకుంటే మూడు నిమిషాలు పట్టదు-"

నాకు దగ్గర్లోనే బాంబు పడ్డట్టయింది. వీడు ఎంత అఘాయిత్యపు పిండం! వాడి వేదనంతా ఆ ముఖంలో అన్నివైపుల నుంచీ స్పష్టంగా కన్పిస్తూంటే, తమాషాగా ఎలా తీసుకోను? పరీక్షపోయిన విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్టు అప్పుడప్పుడు వార్తలు వింటున్నాను. కాని, యీ ప్రత్యేక నిదర్శనం దొరికేదాకా నమ్మలేక పొయ్యాను.

"ఏడ్సినట్టేవుంది- ఎంతమందికి పరీక్ష పోవటంలేదు?" అన్నాను, వాదనతో వాడికి జ్ఞానోదయం కలిగిద్దామని.

"అందరి సంగతీ వేరు-"

"అదేంమాట? నీకు తోడుగా నేను లేనూ?"

"నీకు పోయింది కనుక నాకు కూడా పోతే ఫర్వాలేదంటావా?"

"అనను... కాని, పోయిందాన్ని సాధించాలి కాని, ఓడినట్టు అంగీకరిస్తూ ఆడదానిలాగు ఏడుస్తే ఏం లాభం?"

"నా ఇంటి పరిస్థితులు వేరు-"

"పాసయితే మాత్రం ఉద్యోగాలేవీ?" పరీక్షను విలువలేనిదానిగా రూపిస్తే అది పోయినందు కంతవిచారం ఉండదేమోనని ఇటు తిరిగాను.

"నా స్థితిలో నువ్వుంటే-" అని ఆగాడు.

ఇక వాదనకు పొలిమేర వచ్చింది. ఒకే సమస్యను రెండు ధ్రువాలనుంచీ ఎదుర్కోవటం ఇదేనేమో? ఒకటిగా కన్పించే యీ 'సమస్య'కు రెండు తలలు!

నాకు తెలిసిన వేదాంతాన్నంతట్నీ వాడికి బోధిస్తూ, సినిమాకు తీసుకువెళ్ళి అనేకవిధాల వాడి మనస్సు తిప్పటానికి ప్రయత్నించి, ఆ రాత్రల్లా వాడికోసమే మేలుకొని కూర్చున్నా.

మర్నాడు వాణ్ణి సాగనంపుతూ నన్ను వేధిస్తూన్న అనుమానాన్ని మెల్లిగా బైటపెట్టాను- "ఇంతకూ నువ్వు పేపరెందుకు వదిలేశావ్?"

"మాట్లాడినంత జోరుగా నేను రాయలేను. అంతమందిలో కూర్చొని రాయట మంటే- ఏదో భయం...."

ఇదా వీడి లోపం? ఎగ్జామినర్ కనుక ఒంటరిగా వీణ్ని ప్రశ్నలు వేసి జవాబులు చెప్పజెప్ప మంటేనా - యీ పాటికి యం.ఎ. దాటేవాడు. మొత్తానికి ఆ యూనివర్శిటీవాళ్ళ రూల్స్ యీ విజ్ఞానవంతుడ్ని గుర్తించకుండా చేసినై!

## 2

నాలుగు సంవత్సరాలు గడిచాక సుబ్బారావు ఒకసారి బెజవాడ సినిమాహాల్లో కలిశాడు. చాలా మారిపొయ్యాడు. పరీక్ష పోయినప్పటి వ్యాకులత లాటిది వాడి ముఖంలో ఎక్కడా కన్పించదు. ఆనాడు విడిపొయ్యేప్పటి వాడి ముఖ భంగిమ - నా హృదయంలో వాడికి సంబంధించిన చివరి చిత్రమవటంవల్ల ఇంత మార్పు కన్పించిందేమో!

వాణ్ని చూసేప్పటికి, యీ లోకంలో నేను మరిచిపోయిన ఆత్మబంధు వొకడు తలవని తలంపుగా కలిసినంత సంతోషమైంది. నిరుద్యోగ సమస్యతో వేగిపోతూ, కొత్త వాళ్ళ సానుభూతి వాక్యాల కోసం తిరుగులాడుతూన్న నాకు వీడి దర్శనం, చెప్పలేని తృప్తికి దారితీసింది.

వాడు నా ముఖకళల్ని పట్టే నా స్థితి గ్రహిస్తాడనుకున్నా. కాని అలా జరుగలేదు.

“ఇప్పుడేం చేస్తూన్నట్టు?” అన్నా, జవాబివ్వగానే యీ ప్రశ్ననే నాకు వేస్తాడుకదాననే ఆశతో.

“ఏముందీ?.... ఏమీలేదు...” నిర్లక్ష్యంగా నవ్వాడు. ఆ గొంతులో నిరుద్యోగి ఆవేదనే లేదు.

“ఎంతవరకూ చదివావు?” అన్నాడు కాస్త ఆగి.

“బి.ఏ- ఏం లాభం?” అన్నా, నిట్టూరుస్తూ.

“నాకు తెలుసుగా! అందుకనే మళ్ళీ నేను పరీక్షకు కూర్చోలేదు-” అన్నాడు. పరీక్ష అంటే ఎంత తేలికో యీనాటికి గ్రహించినట్టు.

ఇద్దరమూ సినిమా చూడటాన్ని వదులుకొని, మనుషులు లేనివైపుకు జేరి మాటల్లోకి దిగాం. ఒట్టిమాటలకు కూడా డబ్బు ఇచ్చుకోవాల్సిన స్థలాలు కాబోలు!

“ఉద్యోగం చూడకపొయ్యావా?” అన్నాను.

“ఎందుకోయ్ - వెధవ ఉద్యోగం? వాళ్ళ కాళ్ళూ వీళ్ళ కాళ్ళూ పట్టుకొని ఒకవేళ సంపాయించినా, ఒకరి కింద ఏం పనిచేస్తాం?” ఎంత నిర్లక్ష్యత! ఎంత ఈసడింపు! ఎంత తెగింపు!

“జీవనం-?” అన్నా, ఆనాటి వాడి ఆర్థిక పరిస్థితిని నేనింకా మరువలేదు.

“భార్య పేరవున్న ఐదెకరాలే గతి-!”

ఇంకేం రోగం? నాలాగే బాధపడుతున్నాడేమోనని ఇంతవరకూ యీ డొంకతిరుగుడుగా ప్రశ్నించా-

సినిమాల్ని గూర్చి సోది మొదలెట్టాడు. నిరుద్యోగ సమస్య లేకపోవటంవల్ల యీ రకం సమస్య వీడికి సరదాగా వుంది కాబోలు? మానతాడేమోనంటే- ఎబ్బే! సినిమా అయ్యేదాకా అదేగోల! అటు సినిమావాళ్ళకూ దండగపెట్టాను; ఇటు వీడి సోదితో తలనొప్పినీ కొనితెచ్చుకున్నాను.

సినిమా అవగానే, "పడక ఎక్కడ?" అన్నాడు.

"ఈ మెయిల్‌కు వెళ్ళిపోతా-"

"సరే... పా... నేనూ అటొచ్చి, ఇంటికి వెళ్తా-"

ఇద్దరమూ మెల్లిగా నడుస్తున్నాం. సినిమా అయ్యేప్పటికి ఎంతవరకూ చెప్పాడో, ఆ తెగినకొనను అందుకున్నాడు-

"విజ్ఞానం ఊరికనే వస్తుందీ? ఒక పిక్చర్ పోతే మన వాళ్ళు ఏడుస్తారు. కాని ఇదే హాలీవుడ్‌లో ఐతే, ఎందుకు పోయిందీ అనే ప్రశ్నతో బయలుదేరి, ఆ లోపాల్ని సరిచేసుకుంటూ, ఇంకో పిక్చర్ తీసి, యీవారా ఆవారా అందులో గుంజుకుంటారు. మొదటి పిక్చర్‌కు ఖర్చుపెట్టిన డబ్బుతో ఆ విజ్ఞానాన్ని కొనుక్కొని..."

"అది కాదు- దేశంలో ఇంత నిరుద్యోగ సమస్యకు కారణమేమిటంటావ్?" అన్నాను, ప్లాటుఫారం మీదికి నడుస్తూ.

"మనకు బహుముఖవిజ్ఞానం తక్కువోయ్-"

"ఆఁ ... విజ్ఞానం వున్న వాళ్ళను సరిగ్గా వుపయోగించుకునే వాళ్ళేరీ? ఉదాహరణకు - నా సంగతి చూడు-"

"పోనిస్తూ-" అన్నాడు ఈ విషయం అసలు తనకు కుతూహలాన్ని కల్పించటం లేదన్నట్టు.

"అదిగాదు... అసలు సంగతి ఇదీ... ఈ దేశంలో కష్టానికి సరైన విలువలేదు-"

నా మాటకు అడ్డొచ్చి, "అమెరికాలో ఫిలిం జర్నలిజం-" అంటున్నాడు.

"అంటే... లండన్‌లో మామూలు కూలీకి రోజుకు మూడు, నాలుగు షిల్లింగులిస్తే- ఇక్కడ పావలాకన్న దొరకదాయె!" అంటూ రైల్లో ఎక్కాను. వాడు ప్లాటుఫారం మీదే నిలబడి మాట్లాడుతున్నాడు.

"ఇక్కడ ఫిలింజర్నలిజం ఏముందోయ్? సంవత్సరానికి నాలుగు పిక్చర్లు తీస్తే- ఇరవై సినిమాపత్రికలాయె! స్టూడియో మొఖం ఎరగని వాడు కూడా వ్యాసాల్ని రాస్తూంటే-?"

నాకు బాగా కోపం వచ్చింది; అసలు సమస్యల్ని వదిలి యీ ఉపసమస్యల్ని చర్చించటం నా స్థితిలో ఉన్నవాడికి ఎలా వుంటుందీ?

"ఒక్కటి ఆలోచించు- నాలాగు ఇంత పెద్ద చదువు చదివాక, ఆత్మాభిమానం పెరిగి తల మీద బరువుగా కూర్చున్నాక, చిన్న ఉద్యోగాల కోసం చెయ్యిజాపటం ఎంత కష్టం! వెధవలోకం నన్నేదో గొప్పగా చూస్తూండబట్టి - వీళ్ళందరిముందూ నా అంతట నేనే యీ గొప్పతనాన్ని తీసేసుకోలేక దాన్ని నిలుపుకునేందుకు చస్తున్నాను- నాలాటివాళ్ళు దేశంలో-"

"నేనులేనూ?" అన్నాడు, నా మాటల్ని వింటూన్నట్టు.

"నీ సంగతి వేరు-"

"నీకు తోడుగా ఉన్నాగా?"

"నీకేం- అటో ఇటో డబ్బు రాల్తోంది."

"నువ్వూ మొండికేస్తే సరి.... ఇదేమిట్లే కాని.... అసలు మన ఫిలుంకు కావాల్సింది కథోయ్: ట్రాజడీలా, కామెడీలా జీవత్కథలా అనే సమస్యను వదిలి..."

రైలు కూతేసింది! నా కోపం ఆగే స్థితిలో లేదు.

"వెధవ సినిమాగోల-"

"ఇందాకట్నుంచీ చూస్తాను. కాస్సేపు కులాసాగా మాట్లాడుకోకుండా, నీ నిరుద్యోగ సమస్యతో నావెంటపడితే?" అన్నాడు. తన కోపాన్ని ప్లాటుఫారం తన్నటంతో సూచిస్తూ.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. ఒకే సమస్యను ఇద్దరమూ ఇంత భేదంలో ఎదుర్కోవటాన్ని సహించలేక పొయ్యాను. ఇప్పటికే నేను వాణ్ణి దాటి రెండుమూడు గజాలు ముందుకువెళ్ళినా, కిటికీలోంచి ఎడంచెయ్యి ముందుకుజాచి పెద్దగా, "నువ్వు నా స్థితిలో ఉంటే కాని..." అన్నాను. ఆ గాలిలో, గోలలో, వాడికి వినిపించిందో? లేదో?

– జూన్, *1942*